సాక్షి పెద్దపల్లి

సోమవారం, 26, మే, 2025



మల్లన్నకు బోనం మొక్కులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి పట్నాలు వేసి, బోనాలు తయారు చేసి, నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.



పోటెత్తిన భక్తులు

కమాన్‌పూర్: స్థానిక శ్రీఆదివరాహస్వామి, జూలపల్లి మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ఆదివారం పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన డీఈఈసెట్



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో ఆదివారం చేపట్టిన డీఈఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 137 మంది అభ్యర్థులకు 100 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 144 మందికి 103 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

శాంతిచర్చలు జరపాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజా పంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలోని రాజీవ్ రహదారిపై ఆదివారం నల్లజెండాలతో నిరసన చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, కేశవరావు సహా 27 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌లో హతమార్చడం దుర్మార్గమన్నారు. మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేస్తున్నా కేంద్రప్రభుత్వం పెడచెవిన పెట్టడం శోచనీయమన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు. నాయకులు తోకల రమేశ్, గొల్లపల్లి చంద్రయ్య, గూడూరు వైకుంఠం, మార్త రాములు, రాయమల్లు, సురేశ్, సునీత, మల్లేశ్, రవి, రాములు పాల్గొన్నారు.


సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.శ్రీనివాస్ డిమాండ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. పహల్గామ్ హత్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఆపరేషన్ సిందూర్‌లో దాగిఉన్న అంశాల్లో అన్నికోణాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడి చేసిన వారిని ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి పట్టుకోలేదని, ఆపరేషన్ సిందూర్‌లో యుద్ధం అర్థంతరంగా ముగిసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నాయకులు ఐ.కృష్ణ, నరేశ్, వెంకన్న, చిలుక శంకర్, రామకృష్ణ, రాజేశం, మేరుగు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అరుణోదయ కళాకారుల పాటలు ఉత్తేజపర్చాయి.

ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల పరీక్ష



కాలేజీ ఎదుట అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వడిగ్రీ కాలేజీలో ఆదివారం గ్రామపాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 90మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 82మంది హాజరయ్యారని పరీక్షల సూపరింటెండెంట్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ వేణు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నేడు మంత్రి పర్యటన

మంథని: నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. గుంజపడుగులో రూ.2.90 కోట్లతో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్ట్ అనుమతి పత్రాలను మంత్రి అందజేస్తారు. మంథని బస్ డిపో సమీపంలో డ్రీమ్, స్టార్ట్ – రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌లో భాగంగా గ్రామీణ ప్రొటోటైపింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. మల్హర్ మండలం కొయ్యూరు సరస్వతీ పుష్కరాలకు వెళ్లేవారికి అన్నదానం ప్రారంభిస్తారు.

విస్తరణకు అడుగులు

- జోరుగా భవనాలు, షాపుల కూల్చివేత
- రామగుండం నగరంలో తెరుచుకుంటున్న కొత్తదారులు
- దశాబ్దాల తర్వాత వేగంగా రహదారుల అభివృద్ధి
- ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్‌లకూ అంకురార్పణ
- మరో 50ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రగతి పనులు
- హైవేపై ప్రమాదాల నియంత్రణకు సర్వీస్ రోడ్ల నిర్మాణం



గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఇలా రూపుదిద్దుకోనున్న సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్ నమూనా



రాజేశ్ థియేటర్ వెనకాల కూలుతున్న భవనం



బస్టాండ్ సమీపంలో కూల్చివేసిన భవనం

నగరంలో కూల్చివేతల వివరాలు

- రామగుండం నగరంలోని లక్ష్మీనగర్‌లో పురాతన సినిమా థియేటర్ కూల్చివేసి దానిస్థానంలో ఆధునిక షాపింగ్ నిర్మాణానికి ప్రతిపాదించారు.
- గోదావరిఖని ప్రధాన చౌరస్తా – రీగల్ షూమార్టు – మసీదు వరకు రోడ్డు విస్తరణ కోసం దుకాణాల కూల్చివేత.
- చౌరస్తాలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న సింగరేణి క్వార్టర్లు తొలగించి వాటిస్థానంలో సింగరేణి ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తోంది.
- రామగుండం బీ – పవర్‌హౌస్ గడ్డ – గంగానగర్ ఫ్లైఓవర్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మించేందుకు అడ్డుగా ఉన్న బస్టాండ్ సమీపంలోని భవనం, 20 షాపుల కూల్చివేత.
- గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని గాంధీ మార్కెట్‌లోగల 70 దుకాణాలు తొలగించి అక్కడ ఆధునిక షాపింగ్ నిర్మిస్తున్నారు.
- రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంపెక్స్ ఎదుట గల స్లాబ్ కూల్చివేత.
- కల్యాణ్‌నగర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఓ రాజకీయ నేత ఇల్లు కూల్చివేత.
- మార్కండేయకాలనీలో రోడ్డు విస్తరణకు సుమారు రెండు దశాబ్దాలుగా ఆటంకం కలిగిస్తున్న భవనాన్ని శనివారం కూల్చివేశారు.
- వీటిద్వారా మరో 50ఏళ్ల వరకు అప్పటి ప్రజావసరాల కోసం రహదారుల విస్తరణ, ఆధునిక దుకాణ సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

గోదావరిఖని: జిల్లాలోనే ఏకైక నగరం రామగుండం. పారిశ్రామిక ప్రాంతంగా ప్రఖ్యాతిగాంచిన నగరంలో గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం పట్టణాలు ఉన్నాయి. అయితే, ప్రధాన ప్రాంతాల్లో ఇరుకైన రోడ్లు నగరవాసులకు చుక్కలు చూపెడుతున్నాయి. వాటి విస్తరణకు పలుపర్యాయాలు ప్రయత్నాలు జరిగినా.. భవనాలు, నివాసాలు అవరోధం కలిగిస్తూ వస్తున్నాయి. వాటిని తొలగించేందుకు యత్నిస్తే రాజకీయ ఒత్తిళ్ల ఆటంకం కలిగిస్తున్నాయి. వీటన్నింటినీ అధిగమించడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధికార పార్టీ ఎమ్మెల్యే కావడం, సింగరేణితోపాటు ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలు సహకరించడంతో నగరం ఆధునికత సంతరించుకుంటోంది.

సినిమా టాకీస్ కూల్చివేతతో శ్రీకారం..

నగరం నడిబొడ్డున ఉన్న ఓ సినిమా టాకీస్ కూల్చివేతతో రోడ్ల విస్తరణకు తొలిఅడుగు పడింది. ప్రస్తుతం బీ – పవర్‌హౌస్‌గడ్డ నుంచి గోదావరి నది సమీపంలోని గంగానగర్ ఫ్లైఓవర్ వరకు సర్వీస్ రోడ్ల విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే రాజీవ్ రహదారి వెంట సర్వీసు రోడ్ల నిర్మాణం వేగవంతమైంది. వీటికి అడ్డుగా ఉన్న భవనాల కూల్చివేతలకు తొలుత వ్యతిరేకత ఎదురైనా.. అదేస్థాయిలో రోడ్ల విస్తరణ, ఆధునిక వ్యాపార సముదాయాల నిర్మాణం, నగర అభివృద్ధికి అడుగులు పడుతుండడంతో ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది.

ప్రమాదాలకు నిలయం..

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రాజీవ్ రహదారి పక్కనే ఉన్న భవనం సర్వీసు రోడ్డు విస్తరణకు అవరోధంగా మారింది. అంతేకాదు.. రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బస్టాండ్‌లోకి వెళ్లడం, ఆటోలు కూడా చక్కర్లు కొట్టడంతో ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సర్వీసు రోడ్ల విస్తరణపై దృష్టి సారించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్.. బస్టాండ్ సమీపంలో కూడా రోడ్డు విస్తరించాలని సూచించారు. దీంతో ఆ భవనాన్ని ఇటీవల కూల్చివేశారు. అదే విధంగా వ్యాపార కేంద్రమైన కల్యాణ్‌నగర్‌లోనూ రోడ్ల విస్తరణ జోరందుకుంది. మార్కండేయకాలనీలో రోడ్డు విస్తరణకు అవరోధంగా ఉన్న రాజేశ్ థియేటర్ వెనకాల ఉన్న ఓ భవనాన్ని కూడా శనివారం బల్దియా అధికారులు కూల్చివేశారు. ఈభవనం కూల్చివేతతో రోడ్డు విస్తరణ వేగం పుంజుకుంటుందని భావిస్తున్నారు.

50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా పనులు

మరో 50 ఏళ్లవరకు అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్లు విస్తరించాలి. ఆధునిక భవనాలు, షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించాలి. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఈ పనులతో కొందరికి ఇబ్బందులు ఎదురైనా చాలామందికి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఇందుకోసం రాజీలేకుండా ముందుకు సాగుతాం.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఠాకూర్ సమీక్ష



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, అధికారులు

గోదావరిఖని : రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదివారం సింగరేణి అధికారులతో సమీక్షించారు. ప్రధాన చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్, ఇంటర్నల్ రోడ్లు, తాగునీటి కోసం ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్, జనగామ, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మురుగునీటిని శుభ్రం చేసే ఎస్టీపీల నిర్మాణం పురోగతిపై ఆరా తీశారు. ఖబ్రస్తాన్ పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, సివిల్ డీజీఎం వరప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభకు హాజరు

గోదావరిఖనిటౌన్: టీపీసీసీ కార్యదర్శి పెద్దెల్లి ప్రకాశ్ తల్లి మధునమ్మ వర్ధంతి సభ ఆదివారం నగరంలో జరిగింది. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఈ సభకు హాజరయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, ఆర్‌జీ–1 జీఎం లలిత్‌కుమార్, ప్రతినిధులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, ముస్తఫా, గట్ల రమేశ్, తిప్పారపు శ్రీనివాస్, అమరేందర్, సతీశ్, వరలక్ష్మి, పద్మజ, చంద్రశేఖర్, గౌర్రె రమేశ్, మోహన్‌రావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



నివాళి అర్పిస్తున్న సంజయ్‌కుమార్

రామగిరి(మంథని): జనాభా ప్రాతిపదికన రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేలుకొలుపు రథయాత్ర ఆదివారం సెంటినరీకాలనీకి చేరింది. ఈసందర్భంగా మార్కెట్ చౌరస్తాలోని అంబేడ్కర్, పూలే, రాణీరుద్రమదేవి స్టేడియం ఎదుట గల తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. అసెంబ్లీలో తీర్మానించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలన్నారు. ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంథనిలో బీసీల అణచివేతకు మంత్రి కుటుంబం ప్రధాన కారణమని ఆరోపించారు. అనేకమంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, మంత్రి సతీమణి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చేనేత శాఖలో రూ.వేల కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, నాయకులు కుమార్ యాదవ్, శంకర్‌లాల్, గౌతం శంకరయ్య, రాజసంపత్, ఆసం తిరుపతి, సైండ్ల సత్యనారాయణ, గద్దల శంకర్, మల్యాల మోహన్, కొండవేన ప్రభాకర్, నూనె రాజేశం, బొంకూరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. అప్రమత్తత అవసరం

- విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి
- ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ మాధవరావు



మాధవరావు

జ్యోతినగర్(రామగుండం): వర్షాకాలం ప్రారంభమైంది. ఈ కాలంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. అందుకే అత్యంత జాగ్రత్తగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ కె.మాధవరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆయన సూచనలు ఇవీ..

- వినియోగదారులు విద్యుత్ సంబంధిత పనులు సొంతంగా చేసుకోవద్దు.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. వీటిని గమనించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లలో బట్టలు ఆరవేసే జీఐ దండెం/వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకుంటే విద్యుత్ సరఫరా అయ్యి షాక్ గురయ్యే ప్రమాదం ఉంది. వీటి కోసం ప్లాస్టిక్ దండేలు ఉపయోగించాలి.
- స్తంభం నుంచి విద్యుత్ సరఫరా అయ్యే తీగలను ఇంటి ఎదుట రేకులకు తాకకుండా చూడాలి.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు పశువులు వెళ్లకుండా కాపరులు అప్రమత్తంగా ఉండాలి. కిందపడిన కరెంట్ వైర్లను గమనించాలి.
- ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్లు ఉపయోగించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడిచేతులతో తాకరాదు.
- కరెంట్ షాక్ సంభవిస్తే సమీపంలోని వ్యక్తులు రక్షించే సమయంలో నేరుగా ముట్టుకోరాదు. కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో తీగ నుంచి బాధితుడిని వేరుచేయాలి.
- రైతులు నాణ్యతమైన వ్యవసాయ పంపుసెట్లు వినియోగించాలి.
- వ్యవసాయ పంపుసెట్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ కచ్చితంగా ఉండేలా చూడాలి. పంపుసెట్లను, స్టార్టర్లను ఎర్త్ చేయాలి. ఎర్త్ చేయనివి తాకితే ప్రమాదం బారినపడతారు.
- విద్యుత్ సంబంధిత పనులన్నీ స్వయంగా కాకుండా ఎలక్ట్రీషియన్‌తోనే చేయించాలి.
- విద్యుత్ కంచెలతో రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- వీటిని ఏర్పాటు చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. ఇవి కేవలం విద్యుత్ సిబ్బంది మాత్రమే చేస్తారు. ఇతరులెవరూ చేయరాదు.
- గ్రామీణ వినియోగదారులు లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్, సెక్షన్ అధికారులను సంప్రదించి విద్యుత్ సేవలు పొందాలి.

సహకార సంఘాల్లో బదిలీల జాతర

- దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం



సుల్తానాబాద్ ప్రాథమిక సహకార సంఘం

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)ల్లో బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కార్యదర్శు(సీఈవో)లతోపాటు ఉద్యోగులను బదిలీ చేయాలని ఇటీవల ఉత్తర్వులను జారీచేసింది. దీర్ఘకాలంగా ఒకే సింగల్‌విండోలో పనిచేయడంతో రైతులను పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారనే ఫిర్యాదుల మేరకు ఉద్యోగుల బదిలీకి శ్రీకారం చుట్టింది. త్వరలో బదిలీలు ఉంటాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సుల్తానాబాద్‌లో ఇటీవల జరిగిన బహిరంగ సభలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించడం గమనార్హం.

తొలిసారి బదిలీలు..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖల పరిధిలోని ప్రాథమిక సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. ఈమేరకు గతనెల 20న ఉద్యోగుల వివరాలు నమోదు చేసింది. ఒకేప్రాంతంలో మూడు నుంచి ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని కచ్చితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, వందేళ్ల చరిత్ర కలిగిన సహకార సంఘాల్లో బదిలీలు చేపట్టడం ఇదే తొలిసారి కావడం విశేషమని అంటున్నారు. జిల్లాలో కార్యదర్శులు 20 మంది ఉండగా సిబ్బంది 92 ఉన్నారని అంచనా.

ఏళ్ల తరబడి ఒకేచోట..

సహకార సంఘాల ఉద్యోగులు, సిబ్బంది ఏళ్ల కొద్దీ ఒకే సంఘంలో పనిచేయడంతో సోమరిపోతుల్లాగా మారారని, తాము చెప్పిందే నడుస్తుందనే భావనతో రైతులు, పాలకవర్గ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. చాలామంది ఉద్యోగులు, సిబ్బంది 10 ఏళ్ల నుంచి 20 ఏళ్లకుపైగా ఒకేచోట పనిచేస్తుండడంతో సమస్యలు వస్తున్నాయని, సంఘాల అధ్యక్షులను గుప్పిట్లో పెట్టుకొని పెత్తనం చెల్లాయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు.. రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్నవారిని బదిలీ చేయవద్దని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

జిల్లా పరిధిలోనే బదిలీ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీచేసిన 44 జీవోను సవరిస్తూ కొత్తగా 82 జీవోగా మార్చింది. బదిలీ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఉమ్మడి జిల్లా పరిధిలో కాకుండా జిల్లా పరిధిలోనే బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రిటైర్మెంట్‌కు దగ్గర ఉన్నవారిని బదిలీ చేయవద్దు.

– బొంగోని శంకర్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రాథమిక సహకార సంఘాల అసోసియేషన్

కల.. నెరవేరేదెలా?



ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం. మైదానం నిండా వర్షపునీరు నిలిచింది. కొద్దిగా ఖాళీ ప్రదేశం ఉండంతో క్రీడాకారులు ఆటలు ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అసౌకర్యాలు ఇబ్బందిగా మారాయి. ఇందుకు నిదర్శనమే ఈ ఫొటో.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

‘ఆధార్’ అవస్థలు



ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన పంజాల మాధవి కుటుంబం ఇది. వారి బాబు ఆధార్‌కార్డులో దొర్లిన పొరపాటును సవరించుకునేందుకు జిల్లా కేంద్రంలోని ఆధార్ కేంద్రానికి ఇటీవల వచ్చింది. పొరపాటు సవరణకు అవసరమైన ఆధారాలు లేవని ఆధార్ కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఇతడి పేరు రాజు. పెద్దపల్లి మండలం కుర్మపల్లి స్వగ్రామం. తన కుమారుడి ఆధార్‌కార్డు కోసం కేంద్రానికి వచ్చాడు. తహసీల్దార్ కార్యాలయం జారీచేసిన బర్త్ సర్టిఫికెట్‌లో పిన్ కోడ్ లేదని ఆధార్ కార్డు ఇచ్చేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారని వాపోయాడు.

- అధికారుల తప్పిదంతోనే తిప్పలు
- సవరించుకునేందుకు వ్యయ'ప్రయాస'లు
- అందుబాటులో నమోదు కేంద్రాలు లేక ఇబ్బందులు



బీఎస్ఎన్ఎల్ ఆఫీసులోని ఆధార్ కేంద్రం

పెద్దపల్లిరూరల్: ఆధార్ కార్డు అన్నింటికీ ఆధారమైంది. బర్త్, డెత్ సర్టిఫికెట్ కావాలన్నా, బ్యాంకు ఖాతా అవసరం ఉన్నా, స్కూల్‌లో ప్రవేశం కల్పించాలన్నా, కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణపత్రాలు కావాలన్నా, సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. తొలుత మీసేవ కేంద్రాల నిర్వాహకులకు సైతం ఆధార్ కార్డు సర్వీసు బాధ్యతలు ఇచ్చినా.. వారు అక్రమాలకు పాల్పడుతున్నారని అనుమానించి వారి బాధ్యతలను తొలగించారు.అయితే, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనే ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల ప్రజలు ఆధార్‌కార్డులో దొర్లిన పొరపాట్లను సవరించుకునేందుకు, పుట్టిన పాపాయికి కార్డు కోసం సుదూర ప్రాంతాలకు తిరుగుతూ అనేక వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు.

పనిచేసేవి నాలుగే..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆఫీసుల ఆవరణలో పనిచేసేందుకు ఏడు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినా అందులో 4 సెంటర్లే పనిచేస్తున్నాయి. వాటిలో ఒక్క కేంద్రమే జెండా ప్రాంతంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో అందరికీ అనువుగా ఉంది. కలెక్టరేట్ ఆవరణలో ఉండాల్సిన ఆధార్ కేంద్రాన్ని అమర్‌నగర్ ప్రాంతంలోని ఓ గల్లీలో ఏర్పాటు చేశారు. దాని చిరునామా తెలుసుకోవడం ఇబ్బందిగా మారింది. కొందరు ఎలాగోలా తెలుసుకుని అక్కడకు చేరుకునేందుకు నానాతంటాలు పడాల్సి వస్తోంది. మరోరెండు కేంద్రాలను బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసినా అక్కడ ప్రజలకు సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. ఆధార్ సెంటర్ల తీరుపై సర్రైనరీతిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ఆధార్ అవస్థలను దూరం చేసి సేవలను దగ్గర చేయాలని కోరుతున్నారు.

ఆపరేటర్లకు వసతి కల్పించరా?

ఆధార్ సెంటర్ కలిగియున్న మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వకార్యాలయాల ఆవరణలోనే ఆధార్ సేవలను అందించాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు ఇప్పటికీ అమలుకు నోచడం లేదు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో ఆఫీసుల్లో ఏర్పాటు చేసుకునేందుకు సంబంధిత ఆపరేటర్లు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ వసతి కల్పించలేదు. దీంతో ఆ కేంద్రాలు పనిచేయడం లేదు.

ఇబ్బంది రావొద్దు



కలెక్టరేట్‌తోపాటు అన్నిమండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఆఫీసుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. సర్కారు ఆఫీసుల్లో ఆధార్ సెంటర్లు ఉంటే ఏ సమస్య వచ్చినా అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించే అవకాశముంటుంది. కలెక్టర్ చొరవ చూపి వీలైనంత త్వరగా ఏర్పాటు చేయించాలి.

– కందుల శ్రీనివాస్, సుల్తానాబాద్

ఆదేశాలు ఉన్నాయి

మీసేవ కేంద్రాలు, ఇతర భవనాల్లో ఏర్పాటు చేసుకున్న ఆధార్ సెంటర్లను ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోకి మార్చాలనే ఆదేశాలున్నాయి. వాటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– గంగయ్య, ఆర్డీవో, పెద్దపల్లి

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

యువకుడి బలవన్మరణం

గంభీరావుపేట(సిరిసిల్ల): ఉన్నత విద్య అభ్యసించినా ఉద్యోగం రావడం లేదనే బెంగతో ఆదివారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన గుడికాడి సంపత్(23) అనే యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పొలం దగ్గర ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈసెట్‌లో మొదటి ర్యాంక్


అక్షయ

రామగిరి: తెలంగాణ ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఈసెట్ పరీక్ష ఫలితాల్లో బుధవారంపేట(రామయ్యపల్లి) గ్రామానికి చెందిన కుర్మ అక్షయ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించి సత్తా చాటింది. మొత్తం 200 మార్కులకు గాను 124 మార్కులు సాధించింది. మైనింగ్ విభాగంలో మొదటి ర్యాంక్‌తోపాటు ఓవరల్‌గా 129వ ర్యాంక్ సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన అక్షయ తల్లితండ్రులు లావణ్య, అనిల్‌కుమార్. లావణ్య వ్యవసాయ కూలి. తండ్రి తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అక్షయ పదోతరగతి రాఘవపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివింది. మైనింగ్ డిప్లొమా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అభ్యసించింది.

రేపు అథ్లెటిక్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. అండర్ 8, 10, 12 సంవత్సరాల బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను త్వరలో సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు క్రీడా పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

సన్న బియ్యం పట్టివేత

మంథని: మంథనిలోని ఓ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో వాహనం నుంచి సబ్సిడీ సన్న బియ్యం దింపుతుండగా.. పౌరసరఫరాల శాఖ, పోలీసులు దాడి చేసి 29క్వింటాళ్ల 20కిలోల బియ్యం పట్టుకున్నారు. అధికారులను చూసి వాహన డ్రైవర్ పారిపోయాడని, బియ్యంతో ఉన్న బండిని పోలీస్ స్టేషన్ తరలిస్తుండగా నల్లవెల్లి సది అనే వ్యక్తి అధికారులపై దుర్భాషలాడి అడ్డుపడినట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. అతడితోపాటు వాహన యజమాని ఆరే సంజీవ్, డ్రైవర్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.1.78లక్షలుంటుందన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

- ఆసక్తికరంగా చెస్, హ్యాండ్‌బాల్ పోటీలు
- ఉత్కంఠభరితంగా క్రికెట్..

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ వేదికగా ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయిలో పలు క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. అలాగే నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. క్రికెట్, హ్యాండ్‌బాల్, చెస్ క్రీడల్లో పోటీలను నిర్వహించి ఉమ్మడి కరీంనగర్ జట్లను ఎంపిక చేయగా, మార్షల్ ఆర్ట్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

చదరంగం


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జట్టు

కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక విశ్వనాథ్ చెస్ అకాడమీలో అండర్-17 బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 30 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులను త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో చిటుమల్ల కశ్యప్, బాలసంకుల అమన్‌రామ్, అమిరిశెట్టి నిశ్రిత్, వేముల అభిరామ్, స్టాండ్ బై క్రీడాకారుడిగా ఈగ శివచైతన్య ఎంపికయ్యారు. బాలికల విభాగంలో పి.పరిణిత, కె.సాధన, టి.మోక్ష, బి.యషశ్రీ, స్టాండ్ బైగా ఎస్.శ్రీహర్షి ఎంపికైనట్లు చదరంగ సమాఖ్య బాధ్యులు, టోర్నీ కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పోటీల నిర్వహణలో రాచకొండ సత్యనారాయణగౌడ్, విశ్వనాథ్ చెస్ అకాడమీ డైరెక్టర్, ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్ ఎ.విశ్వనాథ్ ప్రసాద్, సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

క్రికెట్

కరీంనగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 2డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం 3 మ్యాచ్‌లు జరిగాయి. కరీంనగర్ సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్ జట్టు పెద్దపల్లి, మంథని, రామగుండం జట్టుపై 1 వికెట్ తేడాతో విజయం సాధించింది. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్, చొప్పదండి జట్టు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి జట్టుపై 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. వేములవాడలో జరిగిన మూడో మ్యాచ్‌లో మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ జట్టు సిరిసిల్ల, వేములవాడ జట్టుపై 54 పరుగుల తేడాతో విజయం సాధించింది. పోటీల నిర్వహణలో జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు, మహేందర్‌గౌడ్, మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర ఆల్ స్టైల్ కుంగ్‌ఫూ నూతన కార్యవర్గం

కుంగ్‌ఫూ..

తెలంగాణ రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ నూతన కార్యవర్గాన్ని కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజమల్లు, కోశాధికారి ఎలగందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా ఉదరి యాదగిరి, మహేశ్వర హరికృష్ణ, బార విద్యాసాగర్, వొడ్నాల శ్రీనివాస్, పంద్రాల లింగమూర్తి, లీగల్ అడ్వైజర్ సతీశ్, ఉపాధ్యక్షులు కోడూరి శేఖర్, చందనం రాజేందర్, బద్దెనపల్లి రాజు, జాయింట్ సెక్రటరీ కసూరి ప్రవీణ్, గగ్గూరి దివ్య, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ అభినందించారు.

హ్యాండ్‌బాల్

కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్స్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పోటీల్లో రాణించిన క్రీడాకారులను జూన్ 4 నుంచి 6 వరకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగే 47వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. సంఘం బాధ్యులు నమిలకొండ


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు

ప్రభాకర్, మూల వెంకటేశ్, దాసరి మల్లేశ్, వేల్పుల సురేందర్, కృష్ణహరి, రాజు, తిరుమలేశ్, శ్రీకాంత్, విజయ్, సూర్య, అమర్ రాజు, సాయి, శివాజీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ శివారులో ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ పట్టణం నుంచి నిజామాబాద్ జిల్లాకు టీఎస్07హెచ్‌క్యూ5935 నంబర్ కారులో వెళ్తున్న రాకేశ్.. చందుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ప్రాంతంలో కథలాపూర్ మండల కేంద్రానికి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న టీఎస్21ఎల్6908 నంబర్ కారును ఢీకొట్టాడు. రాకేశ్, ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా..


కార్లను పరిశీలిస్తున్న ఎస్సై అంజయ్య

మరో ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై అంజయ్య సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తరలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


నిధుల కోసం తవ్విన స్థలం

తిమ్మాపూర్: రామకృష్ణకాలనీ శివారులో లోయర్ మానేరు జలాశయం పరిధిలోని ఎస్సారెస్పీ స్థలంలో జరుగుతున్న తవ్వకాలు అనుమానాలకు తావిస్తున్నాయి. తాపాల గుట్ట సమీపంలో కొంతకాలంగా జేసీబీతో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఒక మత్స్యకారుడు ఈ తవ్వకాలను గమనించి స్థానికులకు సమాచారమందించాడు. స్థానికులు అక్కడున్న వారిని ప్రశ్నించగా.. గుట్ట సమీపంలో మట్టి పోయడానికి తవ్వుతున్నామని సమాధానమిచ్చారు. అయితే మట్టి కోసం తవ్వకాలైతే సమానంగా తీయకుండా లోతుగా ఎందుకు తవ్వారని గ్రామస్తులు నిలదీశారు. దీంతో సమాధానం చెప్పకుండానే జేసీబీతోపాటు అక్కడి వ్యక్తులు వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

విచారణ చేయాలి

అనుమానాస్పద తవ్వకాలపై పోలీసులు విచారణ చేయాలని రామకృష్ణకాలనీ గ్రామస్తులు కోరుతున్నారు. గుప్త నిధుల కోసం జరుగుతున్న ఈ కార్యకలాపాలు చట్టవిరుద్ధమని, దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వెల్గటూర్‌లో పిచ్చి కుక్క వీరంగం

వెల్గటూర్: మండలకేంద్రంలో ఆదివారం ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. గంట వ్యవధిలో ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇంటి ముందు ఆడుకుంటున్న చిందం వర్షిత్ (21 నెలలు) కంటిపై దాడి చేసింది. అలాగే ఇంటి ముందు పనులు చేసుకుంటున్న మరో ఇద్దరు మహిళలపై దాడికి పాల్పడింది. గతంలో కోటిలింగాలలో మంచికట్ల మణితేజ (ఆరేళ్లు) ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్క విచక్షణారహితంగా దాడి చేసింది. తీవ్రం


గాయపడిన బాలుడు చిందం వర్షిత్

గా గాయపడిన బాలుడికి రేబిస్ వ్యాధి సోకింది. చెర్లపల్లిలో సంకటి మల్లయ్యకు చెందిన 20 గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. జగదేవుపేటలో నాలుగు గేదెలను చంపేశాయి. ఇలా నెల వ్యవధిలోనే సుమారు 40 పైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తుడికి సెల్‌ఫోన్ అందజేత


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఈవో

ధర్మపురి: దైవ దర్శనం కోసం వచ్చిన ఓ భక్తుడు దేవాలయంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సెక్యూరిటీ సిబ్బందికి దొరికింది. ఈవో చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. జగిత్యాల జిల్లాలోని కథలాపూర్ గ్రామానికి చెందిన తొగుట లక్ష్మినారాయణ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మినృసింహస్వామి దర్శనం కోసం వచ్చారు. దర్శన సమయంలో జేబులో ఉన్న సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. సెక్యూరిటీ గార్డు బీరయ్యకు దొరికింది. ఈవో శ్రీనివాస్‌కు అప్పజెప్పగా.. భక్తుడికి అందజేశారు. సెల్ విలువ రూ.12వేలుంటుందని కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొటోకాల్ రగడ

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. పట్టణంలోని 764 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కళాశాల మైదానంలో కలెక్టర్ చేతుల మీదుగా అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదికపై స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీని అడ్డుకుంటామని ప్రకటించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో ఎస్సైలు శ్రీనివాస్‌రావు, తంగళ్లపల్లి ఎస్సైలు రామ్మోహన్, వినీతరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై దిలీప్ డిస్ట్రిక్ట్ గార్డు పోలీసులతో సభా ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధు కళాశాల మైదానంలోకి వస్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. వేదికపై కేటీఆర్ ఫొటో పెట్టకుండా ఏ పదవి లేని కాంగ్రెస్ నేతలను వేదికపై ఎక్కించడం ఏమిటని మధు


మాట్ల మధు బృందాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అధికారులు అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా ఏం సందేశాన్ని ఇస్తున్నారన్నారు. పోలీసులు అవేం పట్టించుకోకుండా మధుతోపాటు సిలివేరి చిరంజీవి, బండి జగన్, గుండు ప్రేంకుమార్, నందగిరి భాస్కర్‌గౌడ్, సయ్యద్ అఫ్రోజ్, కడారి నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సభా ముగిసే వరకు పోలీసులు కళాశాల మైదానంలోకి బీఆర్‌ఎస్ శ్రేణులు రాకుండా నిఘా ఉంచి పర్యవేక్షించారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

జ్యోతినగర్: ఇరువురు ప్రేమించుకున్నారు. ఆపై యువతి మరొకరిని వివాహమాడింది. అయినా వాళ్ల ప్రేమ బంధం కొనసాగింది. ఈ క్రమంలో ఆమెకు ఒక పాప జన్మించింది. ప్రియుడు చెప్పిన మాటలను నమ్మి తాళి కట్టిన భర్తకు విడాకులిచ్చింది. ఈ తర్వాత ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో చేసేదేం లేక ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి నిరసన చేపట్టింది. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెకు చెందిన మహిళ(26) ఆరు సంవత్సరాలుగా సమీప బంధువైన వ్యక్తితో ప్రేమాయణం కొనసాగింది. ఈ క్రమంలో మహిళ కు కుటుంబ సభ్యులు ఆమెకు మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తితో మూడు సంవత్సరాల క్రితం వివాహం చేశా రు. అయినా మహిళ ప్రేమించిన వ్యక్తితో సంబంధం కొనసాగింది. మూడు నెలల క్రితం ప్రియుడితో కలిసి మంచిర్యాల జిల్లాలోని ఓ ప్రాంతంలో గది అద్దెకు తీసుకొని ఉన్నారు. కుటుంబ సభ్యులు మహిళ అదృశ్యం కేసు సైతం నమోదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి సదరు మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమించిన ప్రియుడిని పెళ్లి చేసుకుంటానని మహిళ తెలిపింది. కుటుంబ సభ్యులు కుల పెద్దలతో పంచాయితీలు నిర్వహించారు. భర్తతో విడాకులు తీసుకుంటే వివాహం చేసుకుంటానని ప్రియుడి మాటలు నమ్మి విడాకులు సైతం చేసుకుంది. విడాకులు పొందినా ప్రియుడు పెండ్లికి నిరాకరించడంతో.. చేసేదేం లేక ప్రియుడి ఇంటి ఎదుట నిరసన చేపట్టింది. దీంతో ప్రియుడి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.

పోలీసుల జోక్యంతో..

ఎస్సై మానస ఘటనా స్థలానికి చేరుకొని మహిళతో మాట్లాడారు. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో.. ఎన్టీపీసీ పోలీసులకు మహిళ ఫిర్యాదు చేసింది.


ఆలయ ఆవరణలో భక్తులు

వైభవంగా మాస శివరాత్రి వేడుకలు


సినీ ప్రొడ్యూసర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు


అన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న భక్తులు

వేములవాడ: మాస శివరాత్రి సందర్భంగా వేములవాడ రాజన్నను ఆదివారం 65వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో ఆలయ అధికారులు లఘు దర్శనాలను మాత్రమే అనుమతించారు. వీఐపీల రాక గణనీయంగా పెరిగింది. బ్రేక్ దర్శనాలు ఊపందుకున్నాయి.

రూ.లక్ష విరాళం

వేములవాడ రాజన్న అన్నదాన సత్రానికి ముస్తాబాద్ మండలం రాజక్కపేటకు చెందిన కోమటిరెడ్డి రాజిరెడ్డి–సరిత దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఏఈవో శ్రవణ్‌కుమార్‌కు ఆదివారం అందజేశారు. ప్రసాదాలు అందించి సత్కరించారు.

ప్రొడ్యూసర్ పూజలు

రాజన్నను సినీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ ముద్దం నరేశ్ వర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. స్వామివారి ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.

లీజు పేరుతో బురిడీ

- దళితబంధు కార్లే లక్ష్యం
- యజమానుల దగ్గర తీసుకొని ఇతర ప్రాంతాల్లో విక్రయం
- నిందితుల వేటలో పోలీసులు
- పదుల సంఖ్యలో మాయమైనట్లు అనుమానం

గోదావరిఖని: ప్రతినెలా భారీగా అద్దె ఇస్తాం.. కార్లు లీజుకిస్తే హైదరాబాద్‌లో పెద్ద సంస్థల్లో నడిపిస్తామంటూ ఓ ముఠా చాలామందిని బురిడీ కొట్టించి లీజు కార్లను విక్రయించిన విషయం వెలుగు చూసింది. గోదావరిఖని ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితోపాటు మరికొంతమంది కలిసి ఈ దందాకు పాల్పడినట్లు తెలుస్తోంది. గతంలో ఎన్టీపీసీ ప్రాంతంలో కూడా ఇలాంటి దందాకు పాల్పడి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిందితుల వేటలో ఉన్నారు.

జల్సాలకు అలవాటు పడి..

జల్సాలకు అలవాటు పడిన ఓ గ్యాంగ్ కార్లను లీజు పేరుతో తీసుకొని అమ్మేసినట్లు తెలుస్తోంది. ప్రతినెలా కొంత మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లిస్తామని నమ్మించి మోసం చేశారు. గోదావరిఖని ప్రాంతానికి చెందిన ముఠా గోదావరిఖని, హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాలకు చెందిన కార్ల యజమానుల నుంచి లీజు ప్రాతిపదికన కార్లు తీసుకొని హైదరాబాద్‌లో విక్రయించినట్లు సమాచారం. వీటిలో ఓ కారు పోలీసులకు చిక్కగా.. మరిన్ని కార్లు కూడా అమ్మినట్లు పోలీసులకు సమాచారమందింది. ఈ ముఠా పదుల సంఖ్యలో అద్దె కార్లను అమ్మివేసినట్లు అనుమానిస్తున్నారు. గోదావరిఖనిలో ఉంటూ జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడితోపాటు మరికొంతమంది కలిసి ఈ దందాను నడిపించినట్లు తెలుస్తోంది. కారును లీజుకిచ్చిన యజమానికి అద్దె ఇవ్వకపోవడం, కారు కూడా చూపించకపోవడంతో అనుమానం వచ్చి నిలదీసేసరికి ఈ విషయం బయటకు పొక్కినట్లు చెబుతున్నారు.

దళితబంధు కార్లే లక్ష్యం

లీజు పేరుతో కార్లను తరలించి విక్రయించిన ఈ ముఠా దళితబంధు కార్లే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. గతంలో కేసీఆర్ దళితులకు దళితబంధు పేరుతో కార్లు కొనుగోలు చేసి ఇచ్చారు. అయితే ఇక్కడ సరైన అద్దె రాకపోవడంతో ప్రతినెలా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు అద్దె చెల్లిస్తామని ఆశ చూపి హైదరాబాద్ తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో దళితబంధు హుజూరాబాద్, జమ్మికుంటలో ఎక్కువ మందికి రావడంతో కార్లు ఎక్కువగా కొనుగోలు చేశారు. వారి అవసరాలను ఆసరాగా తీసుకొని కొత్త మోసానికి తెర లేపినట్లు తెలుస్తోంది.

పదికి పైగా..

పదికి పైగా కార్లు మాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నాలుగు కార్లు విక్రయించినట్లు తెలుస్తోంది. వీటిలో ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు. మిగతా కార్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయి.. వాటిని ఎవరికి తనఖా పెట్టారు.. ఎవరికి విక్రయించారనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు మాత్రం తప్పించుకు తిరుగుతున్నట్లు తెలుస్తోంది. నిందితులు పోలీసులకు చిక్కి పూర్తిస్థాయిలో విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

దొంగల కోసం జల్లెడ

- ఇద్దరు ఎస్సైలతో ప్రత్యేక బృందాలు
- సాయినగర్‌లో సీసీ కెమెరాల పరిశీలన
- వరుస దొంగతనాలతో వణుకుతున్న జనం

వేములవాడ: పట్టణంలోని సాయినగర్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసముండే కాలనీలో ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ జరిగిన అంశాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆదివారం ఇద్దరు ఎస్సైల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కాలనీలోని ప్రతీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వీధుల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. దొంగల ఆచూకీ కోసం విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ఫింగర్ ప్రింట్స్.. ఇటీవల మార్కండేయనగర్‌లో జరిగిన దొంగతనం ఫింగర్ ప్రింట్స్ జత కావడంతో అదే దొంగ ఈ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుడు ఆచూకీ కాస్త లభ్యమైనా.. పూర్తి ఆధారాల కోసం ఇంకా ప్రయత్నాలు చేస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసు యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోందని కాలనీవాసులు అంటున్నారు. సాయినగర్‌లో ఆదివారం పోలీసు బృందాలు రావడంతో సీసీ కెమెరాలున్న గృహ యజమానులు సంపూర్ణ సహకారమందించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. టౌన్ సీఐ వీరప్రసాద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించారు.

చోరీలు వరుసగా..

వేములవాడలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో జనం వణికిపోతున్నారు. వేసవి సెలవుల్లో తమతమ స్వస్థలాలు, విహార యాత్రలు, గుళ్లు, గోపురాలు, పుష్కరాలకు వెళ్లిన జనం వెంటనే తమతమ ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇరుగుపొరుగు వారిని అప్రమత్తం చేసుకుంటున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లొద్దని, ఒకవేళ వెళ్తే తమకు సమాచారమందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

కూలిన ఇళ్లు.. తప్పిన ప్రమాదం

ధర్మపురి: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పెంకుటిల్లులు కూలిపోయాయి. ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నేరెల్ల గ్రామంలో ఓరుగంటి లక్ష్మి ఆశయ్య, మంత్రి భూమక్కకు చెందిన పెంకుటిల్లులు ఆదివారం కూలిపోయాయి. ఇళ్లలో ఉన్నవారు పనులకు


నేరెల్లలో కూలిన ఇల్లు

వెళ్లడంతో ఇంటి పైకప్పులు కూలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ నాయకులు జాజాల రమేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డవేని సత్యం పరిశీలించారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సాయమందేలా చూడాలని కోరారు.

అల్ఫోర్స్ చైర్మన్‌కు ‘రఘునాథం’ అవార్డు

కొత్తపల్లి: రాష్ట్ర విద్యారంగంలో 35 ఏళ్లుగా అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు గాను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.వి.నరేందర్‌రెడ్డికి వై.రఘునాథం ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. కరీంనగర్ శివారులోని ఓ ప్రైవేటు వేడుక మందిరంలో ఆదివారం వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, ఫౌండేషన్ చైర్మన్ వెంకట్ ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తూ.. ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తూ.. అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యనందిస్తూ..


డా.నరేందర్‌రెడ్డికి అవార్డు అందిస్తున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తెలంగాణ రాష్ట్ర విద్యారంగాల్లో సమూలమైన మార్పులు తెస్తున్నందుకు గాను అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. డా.వీఎస్‌ఆర్ మాట్లాడుతూ.. ఈ అవార్డు బాధ్యత పెంచిందని, సిబ్బంది, తల్లిదండ్రులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

ఘనంగా మహా లింగార్చన

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రుద్ర నమకం, మాన్య సూక్తం, లక్ష్మీసూక్తం, పురుష సూక్తం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఒక్కరోజు ఆదాయం రూ 3.70లక్షలు


మహా లింగార్చనలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయానికి ఆదివారం ఒక్కరోజే వివిధ రకాల సేవల ద్వారా రూ.3,70,801 ఆదాయం సమకూరింది.